# మోదీ.. ఏ ముఖం పెట్టుకుని వచ్చావ్?

- పైసా నిధులు ఇవ్వకుండా ఓటు అడిగే హక్కు మీకెక్కడిది!
- ఐటీఐఆర్‌ను రద్దు చేసి యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారు?
- కందుకూరు రోడ్ షోలో ప్రశ్నించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి


కందుకూరు రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి, నవంబర్ 25(నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి ఒక్క రూపాయి నిధులివ్వని ప్రధాని మోదీ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారు? అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోలో ఆమె మాట్లాడారు. మహేశ్వరం ప్రాంతంలో నిర్వహించిన సభలకు మోదీ, అమిత్‌షా, నడ్డాలు పలుమార్లు వచ్చి వెళ్లారని, పదేండ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న మీరు ఇన్ని సార్లు వచ్చి ఈ ప్రాంతానికి ఇచ్చిందేమీ లేదని విమర్శించారు. మొదటి నుంచి మోదీ తెలంగాణ రాష్ట్రం అంటేనే విషం కక్కుతారని, తెలంగాణకు వచ్చిన ప్రతిసారి సీఎం కేసీఆర్, కేటీఆర్, కవితలను తిట్టడం తప్పితే రాష్ట్రానికి ఇది చేశాము! అది చేస్తాం? అని ఏనాడైనా ప్రజలకు చెప్పారా? అని ప్రశ్నించారు. దేశమంతా మెడికల్ కాలేజీలు ఇచ్చి తెలంగాణకు మొండి చెయ్యి చూపారని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో ఐటీఐఆర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడం వల్ల ఐదు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చేవని, మోదీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఐటీఐఆర్ ప్రాజెక్టును క్యాన్సిల్ చేసి యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారని ఆరోపించారు. పదేపదే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించే బీజేపీ నేతలు కేంద్రం తెలంగాణ రాష్ట్రానికి ఏం ఇచ్చిందన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఐటీఐఆర్‌ను రద్దు చేయడం వల్ల ఈ ప్రాంతానికి నష్టం జరిగిందా? లేదా? గుండెపై చెయ్యి వేసుకుని చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ ఇవ్వకున్నా సీఎం కేసీఆర్ జిల్లాకో మెడికల్ కాలేజీని ఇచ్చారని, ఆడబిడ్డలకు గ్యాస్ సిలిండర్‌ను రూ.400కే ఇచ్చేందుకు మ్యానిఫెస్టోలో పొందుపర్చారని పేర్కొన్నారు.

*నాపై పోటీ అంటే ఢిల్లీ స్థాయిలో చర్చలు...*

నాపై పోటీకి నిలబెట్టాలంటే ఢిల్లీ స్థాయిలో ప్రతిపక్ష పార్టీల్లో చర్చలు జరుగుతాయని మంత్రి సబిత ఇంద్రారెడ్డి అన్నారు. సబితమ్మ వెనుక ఉన్న బలగాన్ని చూసి కాంగ్రెస్, బీజేపీలు భయపడుతున్నాయని అన్నారు. సోనియా, రాహుల్ ఈ ప్రాంతంలో సభలు పెట్టారని, సబితమ్మను ఓడించాలంటే ఇంత మంది రావాలా? అని అన్నారు. ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు బీజేపీ, కాంగ్రెస్‌లు తనను ఏమీ చేయలేవని పేర్కొన్నారు.




## జిల్లాలో రూ.63లక్షలు నగదు సీజ్

సిటీబ్యూరో, నవంబర్ 25(నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారుల తనిఖీలు హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా కొనసాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో 9 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు చెకింగ్‌లు చేసి భారీ స్థాయిలో నగదు, అక్రమ మద్యం స్వాధీనం చేస్తున్నాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా శనివారం ఒక్కరోజు ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా రూ.63.55 లక్షలు, ఇప్పటి వరకు మొత్తం రూ.4,66,59,470 నగదు సీజ్ చేశారు. పోలీస్ అథారిటీ ద్వారా రూ.15,06,044 నగదు స్వాధీనం చేసుకోగా, ఇప్పటి వరకు రూ. 63,00,05,354 నగదును సీజ్ చేసినట్లు ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్ తెలిపారు. కాగా, ఎఫ్ఐఆర్‌లు 858 నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 4230 నక్కాస్ ఆపరేషన్స్, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద ఫ్లయింగ్ స్క్వాడ్ సికింద్రాబాద్, కంటోన్మెంట్‌లో ఒక కేసు, వాహనాల దుర్వినియోగంలో మలక్‌పేట్‌లో ఒకటి, అంబర్‌పేటలో రెండు, సనత్‌నగర్‌లో ఒక కేసు నమోదు చేశారు. అక్రమ మద్యం 515 లీటర్స్ సీజ్ చేశారు.

## యువకుడు ఆత్మహత్య

జీడిమెట్ల, నవంబర్ 25 : వివాహం కాలేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. షాపూర్‌నగర్ సమీపం సంజయ్‌గాంధీనగర్‌లో నివాసముండే మల్లయ్య కుమారుడు లంక శివకుమార్(30) ప్రైవేటు ఉద్యోగి. కుటుంబ సభ్యులు కొంతకాలంగా అతడికి వివాహం చేయాలని ప్రయత్నిస్తున్నా సంబంధాలు కుదరడంలేదు. దీంతో మనస్థాపానికి గురైన శివకుమార్ శనివారం ఇంట్లో ఉరివేసుకున్నాడు. స్థానికులు గమనించేసరికే అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

## అల్లాపూర్‌లో మద్యం పట్టివేత

*168.75 లీటర్ల మద్యం, మారుతీ ఈకో కారు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం*

బాలానగర్, నవంబర్ 25: ఎన్నికల సందర్భంగా బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం బాలానగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వేణుకుమార్ వివరాలు వెల్లడించారు. శుక్రవారం అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న 168.75 లీటర్ల మద్యం, మారుతీ ఈకో కారు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి విజయభాస్కర్ సూచనల మేరకు మేడ్చల్ ఏఈఎస్ మాధవయ్య నేతృత్వంలో బాలానగర్ ఎక్సైజ్ సీఐ వేణుకుమార్ తమ సిబ్బందితో అల్లాపూర్ జేకే పాయింట్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి సమయంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అదే సమయంలో బోరబండకు చెందిన నల్లపోగుల సుమన్(33), పైండ్ల బాలరాజులు మారుతీ ఈకో కారులో మద్యం బాటిళ్లను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు సదరు వాహనాన్ని తనిఖీ చేయగా.. అందులో 180 బ్లెండర్స్‌ప్రైడ్ 750 ఎంఎల్ (ఫుల్ బాటిల్స్)ను స్వాధీనం చేసుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. సుమన్, బాలరాజులు ఇచ్చిన సమాచారం మేరకు మోతినగర్‌లోని ఎంఎల్ శ్రీనివాస్ వద్ద మద్యం బాటిళ్లు ఉన్నాయని సూచించడంతో శ్రీనివాస్ ఇంటిపై ఆకస్మిక దాడులు చేశారు. శ్రీనివాస్ వద్ద 54 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 168.75 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వేణుకుమార్ తెలిపారు. ఈ తనిఖీలలో డీటీఎఫ్ సీఐ నర్సిరెడ్డి, ఎస్సైలు రఘు, శ్యాంసుందర్, సలీం, సిబ్బంది రాంచందర్, శ్రీనివాస్, కురుమయ్య, బాలరాజులు ఉన్నారు.

## రాజ్యాంగం కల్పించిన హక్కులు సద్వినియోగం చేసుకోవాలి

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వామన్‌రావు



సేవారత్న పురస్కారాలు అందుకున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 25 : రాజ్యాంగ దినోత్సవాన్ని సంవిధాన్ దివస్‌గా 2015లో భారత ప్రభుత్వం ప్రకటించిందని, అప్పటి నుంచి ప్రతి ఏడాది ఘనంగా జరుపుకుంటున్నామని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వామన్‌రావు వెల్లడించారు. అబిడ్స్ తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వత పరిషత్తు హాల్‌లో తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా 'రాజ్యాంగ హక్కులు' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో జస్టిస్ వామన్‌రావు పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలోనే మన రాజ్యాంగం అతిపెద్దదిగా ఆయన పేర్కొన్నారు. మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య మాట్లాడుతూ.. యువత రాజ్యాంగాన్ని అధ్యయనం చేస్తూ హక్కులను సద్వినియోగం చేసుకుంటూ పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్ నారాయణ, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి ప్రసంగిస్తూ రాజ్యాంగంలోని పలు ఆర్టికల్స్‌ను విద్యార్థులకు వివరించారు. తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, కార్యదర్శి డాక్టర్ మహ్మద్ అక్తర్ అలీ, విద్యావేత్త జి.విజ్ఞత పాల్గొన్న ఈ సభలో సామాజిక సేవలో విశేష కృషి చేస్తున్న న్యాయవాదులు సిహెచ్.శాంసన్‌బాబు, సిహెచ్.వెంకట్ యాదవ్, టి.మంజుల, టీపీసీసీ నగర అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.హుస్సేనీ ముజీబ్‌లతోపాటు బి.దయానంద్ యాదవ్, డాక్టర్ కె.వి.రాంప్రసాద్, రుమీల సీతారాం, ఇ.ఉదయశ్రీ, ఎం.రాజారెడ్డిలకు సేవారత్న పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

## మల్కాజిగిరి ఏసీపీ బదిలీ.. కొత్త ఏసీపీగా చంద్రశేఖర్

సిటీబ్యూరో, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని మల్కాజిగిరి డివిజన్ ఏసీపీ ఆకుల శ్రీనివాస్‌ను బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో డీజీపీ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న చాపల చంద్రశేఖర్‌కు మల్కాజిగిరి ఏసీపీగా పోస్టింగ్ ఇచ్చారు. శ్రీనివాస్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు.

## ముగిసిన రాజేశ్‌జైస్వాల్ కస్టడీ

జ్యుడీషియల్ కస్టడీకి తరలించిన కోర్టు

నాంపల్లి కోర్టులు, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం జరిగి 10 మంది మృతి చెందారు. ఈ ప్రమాదానికి కారణమైన యజమాని రాజేశ్‌జైస్వాల్‌ను పోలీసులు మూడురోజుల కస్టడీకి తీసుకున్నారు. శనివారం కస్టడీ ముగిసినందున అధికారులు కోర్టు ఎదుట హాజరుపర్చారు. గోదాములో నిల్వ ఉంచిన రసాయన పదార్థాలతోనే తీవ్ర నష్టం సంభవించినట్లుగా ప్రాథమిక విచారణలో నమోదు చేసిన సంగతి తెలిసిందే. పోలీసులు అన్ని కోణాల్లో విచారించారు. విచారణ ముగిసినందున నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ వి.ఈశ్వరయ్య ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నిందితుడిని అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## ఇంటర్ వాలీబాల్ విజేత ధాత్రి మోడల్ స్కూల్



తిరుమలగిరిలో శనివారం జరిగిన ఇంటర్ స్కూల్ వాలీబాల్ టోర్నీలో విజేతగా నిలిచిన ధాత్రి మోడల్ స్కూల్‌కు ట్రోఫీ అందజేస్తున్న జాతీయ మాజీ వాలీబాల్ ప్లేయర్ కిరణ్‌రెడ్డి. ఫైనల్లో ధాత్రి మోడల్ స్కూల్ 15-12, 15-10తో ప్రభుత్వ బాలుర పాఠశాల(తిరుమలగిరి)పై విజయం సాధించింది.